ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
మంగళవారం 22 అక్టోబరు 2024



గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎం, హోం మంత్రి, డీజీపీ



ప్రభుత్వ అవినీతిపైనే బీజేపీ ప్రచారం..!

ప్రభుత్వ అవినీతి ప్రచారం చేయడమే బీజేపీ తన లక్ష్యంగా పెట్టుకుంది. ముడాలో సీఎం సిద్దరామయ్య కుటుంబం పూర్తిగా కూరుకుపోయిందని, ఇదే ప్రధాన అస్త్రంగా ప్రచారం చేయదలిచారు. మరో ఇద్దరు మంత్రులు ఎంబీ పాటిల్, ప్రియాంక ఖర్గేలపై భూ ఆక్రమణల ఆరోపణలపై దర్యాప్తు జరిపించాలని రాజ్‌భవన్‌కు ఫిర్యాదు అంశాలను ప్రచారం చేయదలిచారు. తాజాగా మరో మంత్రి బోసరాజుపై అటవీశాఖల భూముల ఆక్రమణలు రావడంపైనా ప్రస్తావించాలని భావిస్తున్నారు. అయితే చన్నపట్టణ టిక్కెట్ కేటాయించే విషయంలో బీజేపీ, జేడీఎస్‌ఎల మధ్య సమన్వయం కొరవడినట్లయ్యింది. బీజేపీలో పలువురు నాయకులు సీపీ యోగేశ్వర్‌కు టిక్కెట్ ఇవ్వాలని ప్రతిపాదిస్తుండగా పార్టీ అగ్రనేత యడియూరప్ప మాత్ర భిన్నమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆ స్థానం జేడీఎస్‌కు చెందినదని వారు ఎవరికైనా టిక్కెట్ ఇచ్చుకోవచ్చునన్నారు. కానీ కుమారస్వామి వారసుడు నిఖిల్, భార్య అనితలలో ఎవరు పోటీ చేసినా ఓటమి తప్పదని సర్వేలు తేల్చినట్లు సమాచారం. సీపీ యోగేశ్వర్‌కు టిక్కెట్ దక్కకపోతే ఆయన ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగితే బీజేపీ - జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి ఎవరవుతారనేది ప్రశ్నార్థకంగా మారింది. అదే జరిగితే కూటమికి కోలుకోలేని దెబ్బ పడనుంది. మరోవైపు సీపీ యోగేశ్వర్‌ను కాంగ్రెస్‌లోకి రప్పించుకుని అభ్యర్థిని చేస్తారనే ప్రచారం కూడా సాగుతోంది. మంగళవారం మహత్తరమైన పరిణామాలు చోటు చేసుకుంటాయని తెలుస్తోంది.

ఉప ఎన్నికల్లో విజయమే..

లక్ష్యం..!

- ఒక్కో స్థానంలో 10 మంది మంత్రులు, 30మంది ఎమ్మెల్యేలు
- బీజేపీ అబద్ధాలను తిప్పికొట్టండి
- దర్యాప్తు సంస్థల బెదిరింపులకు తలొగ్గాల్సిన అవసరం లేదు
- మంత్రులతో సమావేశంలో సీఎం, డీసీఎం
- ఉపపోరులో ప్రభుత్వ అవినీతే బీజేపీ ప్రచారాస్త్రం

బెంగళూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మూడు శాసనసభ స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో గెలుపే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ఆదివారం రాత్రి సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మూడు స్థానాల్లోనూ గెలుపు సాధించాల్సిందేనని తీర్మానించారు. ఒక మంత్రికి ఒక హోబళి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించేలా తీర్మానించారు. మంత్రులు ఎన్నికలు ముగిసేదాకా వారికి కేటాయించిన ప్రాంతాల్లోనే ఉండాలని సూచించారు. ప్రతి నియోజకవర్గానికి పదిమంది మంత్రులను నియమిస్తామన్నారు. వారికి అనుబంధంగా నియోజకవర్గానికి 30మంది ఎమ్మెల్యేలు సహకారం అందిస్తారన్నారు. వీరితో పాటు జిల్లాల పరిధిలో ఉండే సీనియర్ పార్టీ నేతలు, బోర్డులు, కార్పొరేషన్‌ల చైర్మన్లు పనిచేసేలా తీర్మానించారు. మంత్రులు అందరినీ సమన్వయ పరుచుకుని ఎన్నికల్లో పనిచేయాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేల జాబితాను ఒకటి రెండు రోజుల్లోనే తీర్మానిస్తామన్నారు. బీజేపీ అబద్ధాలను తిప్పికొట్టేలా ప్రచారం చేయాలని సూచించారు. బీజేపీ వారు టిక్కెట్ ఎవరికి ఇచ్చినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీసీఎం సూచించారు. మూడు నియోజకవర్గాల్లో పార్టీకి బలమైన కార్యకర్తలు ఉన్నారని వారిని విశ్వాసంలోకి తీసుకోవాలని సూచించారు. బీజేపీవారి ఆగడాలు ఎన్నికల్లో జరగవన్నారు.



మంత్రులతో ప్రత్యేక సమావేశంలో సీఎం, డీసీఎం

ప్రతి గ్రామంలోనూ బూత్‌స్థాయిలో నిరంతరం ప్రజలకు అందుబాటులోకి ఉంటూ ప్రచారం చేయాలని సూచించారు.

దర్యాప్తు సంస్థలతో జర భద్రం..

ఉప ఎన్నికలు ముగిసేదాకా కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థల ద్వారా ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుందని జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. సీబీఐ, ఐటీ, ఈడీ దాడుల పట్ల అప్రమత్తత ముఖ్యమన్నారు. గ్యారెంటీలపై తప్పుడు ప్రచారం చేసేవారికి స్థానికంగా వివిధ పథకాలతో లబ్ధి పొందినవారిని కలుపుకొని ప్రచారం చేయాలని సూచించారు.

పోలీసుల త్యాగాలను

మరువలేం

- రూ.2వేల కోట్లతో 10 వేలమందికి క్వార్టర్స్
- సిబ్బంది పిల్లల కోసం ఏడు పబ్లిక్ పాఠశాలలు
- అమరవీరుల సంస్మరణ సభలో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసుల త్యాగాలను మరవలేమని, పౌరులందరూ అమరుల సేవలను స్మరించుకోవాలని సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. పోలీసులు స్వతంత్రంగా పనిచేసేలా తమ ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. పోలీసు అమరవీరుల దినం పురస్కరించుకుని సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించే విషయంలో ప్రభుత్వం పోలీసులకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చామన్నారు. వచ్చే ఏడాది 10వేలమంది పోలీసులకు క్వార్టర్స్ నిర్మించేందుకు రూ.2వేల కోట్లు కేటాయించామన్నారు. రూ.200 కోట్లతో పది కొత్త పోలీస్‌స్టేషన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసుల పిల్లలకోసం 7 ప్రాంతాల్లో పబ్లిక్‌స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవల ఏడాదిలో దేశంలో 216మంది రాష్ట్రంలో 12మంది పోలీసులు అమరులయ్యారని వారి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. దేశ అంతరంగిక భద్రత కాపాడడంలోనూ నేరాలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలను నియంత్రించడంలో పోలీసులు కీలకభూమిక పోషిస్తున్నారన్నారు. నేరాల నియంత్రణకు 6వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, 260కుపైగా జాతీయ రహదారుల గస్తీ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. హోం మంత్రి పరమేశ్వర్, డీజీపీ అలోక్ మోహన్, చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

అన్నీ వారికేనా..!

- సండూరు టిక్కెట్‌పై వీడని ఉత్కంఠ
- కాంగ్రెస్‌లో రగిలిన అసంతృప్తి
- సీఎం, డీసీఎం వద్ద పంచాయితీ

బళ్లారి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సండూరు కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాల రగిలింది. అన్నీ ఆ కుటుంబానికేనా అని బహిరంగంగా ప్రశ్నిస్తున్నారు. ఏకంగా మీడియా ముందుకు వచ్చి అసంతృప్తి వ్యక్తం చేయడం.. తరువాత ఈ పంచాయితీ ఏకంగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ జోక్యం చేసుకునే వరకూ పరిణామాలు తలెత్తాయి. రాష్ట్రంలో మూడు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల అయిన సంగతి తెలిసిందే. సండూరుకు ఉప ఎన్నిక జరగనుండడంతో జిల్లాలో రాజకీయ వేడి రగులుకుంది. ఎమ్మెల్యేగా గెలిచిన ఇ. తుకారాం ఆ పదవికి రాజీనామా చేసి ఎంపీ గా పోటీ చేసి గెలిచారు. ఖాళీ పడిన ఎమ్మెల్యే స్థానానికి తుకారాం అన్నపూర్ణ పేరు దాదాపు ఖరారు చేస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు భావించారు. ఈ నేపత్యంలో కొందరు కాంగ్రెస్ నాయకులు మాకూ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరారు. లక్ష్మన్న పాటు మరి కొందరు టికెట్ ఆశించారు. కానీ ఇక్కడ సండూరు రాజులైన సంతోష్ లాడ్ కుటుంబం తుకారాం కే మొగ్గు చూపుతుంది. ఈ నేపథ్యంలో అసంతృప్తులను బెంగళూరుకు పిలిపించి పార్టీ నాయకులు బుజ్జగించారని తెలిసింది. లక్ష్మన్నకు ముందు రోజుల్లో పార్టీ నుంచి ఎమ్మెల్సీ ఇస్తామని హమీ ఇచ్చారని సమాచారం. మిగిలిన వారిలో కొందరికి కార్పొరేట్ స్థాయి పదవులు ఇస్తామని సీఎం, డీసీఎం హమీలు ఇచ్చారని తెలిసింది. ఈ ఉప ఎన్నికలు చాలా కీలకం అందుకు కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుంది. ఎవ్వరూ అలకబూనరాదని, కలసికట్టుగా పార్టీని గెలిపించాలని సీఎం ఆదేశించినట్లు సమాచారం. ఇక దాదాపు కాంగ్రెస్‌లో అసంతృప్తి తగ్గుతుందనే నమ్మకం తో కాంగ్రెస్ నాయుకులు అంటున్నారు. అలాంటిదేమీ లేదు రాజకీయంలో ఒక సారి ముసలం మొదలైన తరువాత మూసిపెట్టడం అంత సులువు కాదని కొందరు అంటున్నారు. మొత్తానికి బీజేపీ అభ్యర్థి ప్రకటించినా, కాంగ్రెస్‌లో ఇంకా ఉత్కంఠకు తెర పడడం లేదు.



హంపి కొండపై చిరుత

హంపిలో చిరుత

ప్రసిద్ధిగాంచిన పర్యాటక ప్రాంతం హంపిలో సోమవారం సాయంత్రం అక్క చెల్లెలు కొండపైన చిరుత ప్రత్యక్షమైంది. నెల రోజులుగా ఈ ప్రాంతంలోని నవ దిబ్బ, పుష్కరేణి, విజయవిఠల దేవస్థానం ప్రాంతాల్లో చిరుత సంచరిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.

8



లోతట్టు ప్రాంతాలు జలమయం

బెంగళూరు నగరవ్యాప్తంగా పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 9 గంటలదాకా వాన దంచేసింది. రోడ్లు చెరువులను తలపించాయి.

7

ఈజీపుర వీధి ఇలా

ఇంట్లోకి చేరిన నీటిని తోడేస్తున్న కుటుంబీకులు



మరోసారి ప్రజ్వల్‌కు

నిరాశే..!

- బెయిల్ పిటిషన్ తిరస్కరణ
- నాలుగు నెలలుగా జైలులోనే



బెంగళూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు మరోసారి హైకోర్టులో చుక్కెదురయ్యింది. లైంగిక దాడులకు సంబంధించి మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ మూడు కేసులలో దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌లను కొట్టివేస్తూ హైకోర్టు ధర్మాసనం సోమవారం ఆదేశించింది. దీంతో ప్రజ్వల్ రేవణ్ణకు మరింత కాలం జైలులోనే గడపక తప్పదని నిర్ధారించినట్లు అయ్యింది. రెండు అత్యాచార కేసులతో పాటు మహిళ అశ్లీల దృశ్యాలను రికార్డు చేసుకున్న వివాదానికి సంబంధించి ఆయనపై కేసులు నమోదయ్యాయి. మూడు కేసుల నుంచి విముక్తి పొందేందుకు ప్రజ్వల్ తరపు న్యాయవాదులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై హైకోర్టు న్యాయమూర్తి ఎం నాగప్రసన్న ఏకసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ప్రజ్వల్ తరపున న్యాయవాది జి అరుణ్ వాదనలు వినిపించారు. దర్యాప్తు జరుపుతున్న సిట్ తరుపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రొఫెసర్ రవివర్మకుమార్ వాదనలు వినిపించారు. ప్రస్తుతానికి దాఖలు చేసిన మూడు కేసుల బెయిల్ పిటిషన్లను ధర్మాసనం కొట్టవేసింది. హాసన్ జిల్లా పంచాయతీ మాజీ సభ్యురాలిపై అత్యాచార కేసులో బెయిల్ పిటిషన్‌పై రెండురోజులలో తీర్పు ప్రకటిస్తామన్నారు. ఒకవేళ ఈకేసులో బెయిల్ మంజూరైనా మిగిలిన కేసుల్లో బయటకు వచ్చే అవకాశం లేనట్లు అయ్యింది. ప్రజ్వల్ రేవణ్ణ 4 నెలలకుపైగా జైలులోనే గడుపుతున్నారు. బెయిల్‌కోసం దాఖలు చేసుకున్న పిటిషన్‌పై సుదీర్ఘంగా విచారణ సాగింది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 97.91 శాతం పోలింగ్

- మూడబిదరెలో 100శాతం
- మరో ఆరుచోట్ల 99శాతం
- 24న కౌంటింగ్



ఉళ్ళాలలో ఓటు వేస్తున్న మాజీ మంత్రి యూటీ ఖాదర్

బెంగళూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ-ఉడుపి స్థానిక సంస్థల కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రికార్డుస్థాయిలో పోలింగ్ నమోదైంది. రెండు జిల్లాలు కలిపి 16 తాలూకాల పరిధిలో 392 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఓటింగ్ జరిగింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. రాష్ట్ర ఎన్నికల అధికారులు పోలింగ్‌శాతాన్ని విడుదల చేశారు. సరాసరిన 97.91 శాతం పోలింగ్ నమోదైంది. 6,032 మంది ఓటర్లు ఉండగా వీరిలో 5,906 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2,904మంది పురుషుల్లో 2,839 మంది ఓటు వేయగా, 3128మంది మహిళలకుగాను 3,067మంది ఓటు వేశారు. దక్షిణకన్నడ జిల్లా మూడబిదరె తాలూకాలో ఏకంగా వందశాతం పోలింగ్ నమోదైంది. బంట్వాళలో 99.24శాతం, పుత్తూరులో 99.20, కడబలో 99.65, ఉడుపి జిల్లా కార్కళలో 99.28, హెబ్రిలో 99.18, ఉడుపిలో 99.18 శాతం పోలింగ్ నమోదైంది. మిగిలిన తాలూకాలలో ఉడుపి జిల్లా భైందూరులో 88.80, కుందాపులో 93.59, బ్రహ్మవరలో 93.83, కాపులో 97.77, దక్షిణకన్నడ జిల్లా ముల్కి తాలూకాలో 98.29, మంగళూరులో 98.33, ఉళ్ళాలలో 93.13శాతం, బెళ్తంగడి 98.12, సుళ్యలో 97.67శాతం నమోదైంది. ఓటు హక్కు వినియోగించున్నవారిలో శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, ఉడుపి-చిక్కమగళూరు ఎంపీ కోట శ్రీనివాసపూజారి, దక్షిణకన్నడ ఎంపీ బ్రిజేశ్ చౌటలతోపాటు పలువురు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా బరిలో కాంగ్రెస్ నుంచి రాజు పూజారి, బీజేపీ నుంచి కిశోర్‌కుమార్ బోట్యాడితోపాటు ఇండిపెండెంట్లు ఇద్దరు పోటీ చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థికే ఎక్కువశాతం పోలైనట్లు తెలుస్తోంది. కాగా ఈనెల 24న ఓట్ల లెక్కింపు జరగనుంది.



ఓటు వేసిన బ్రిజేశ్‌చౌట తదితరులు

మంగళూరులో ఓటేసిన కౌన్సిలర్లు



ఎమ్మెల్సీ పదవికి

యోగేశ్వర్ రాజీనామా

- చన్నపట్టణలో పోటీ చేసేందుకే అంటున్న బీజేపీ నేతలు
- కాంగ్రెస్‌లో చేరతారని జోరుగా ఊహాగానాలు



రాజీనామా సమర్పిస్తున్న సీపీ యోగేశ్వర్

బెంగళూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చన్నపట్టణ శాసనసభ ఉప ఎన్నికల్లో టిక్కెట్ ఆశిస్తున్న మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత సీపీ యోగేశ్వర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీజేపీ ఎమ్మెల్సీ పదవికి యోగేశ్వర్ సోమవారం రాజీనామా చేశారు. హుబ్బళ్ళిలో విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టికి రాజీనామా పత్రాన్ని సమర్పించారు. హుబ్బళ్ళి బయల్దేరేముందు చన్నపట్టణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జేడీఎస్ తరపున పోటీ చేయాలని తనను ఎవరూ కోరలేదన్నారు. నియోజకవర్గ ప్రజలు అటువంటి ప్రయత్నం చేయరాదని సూచించారన్నారు. బీజేపీ నుంచే పోటీ చేయాలని భావిస్తున్నానన్నారు. అయితే ఎవ్వరూ తనకు మద్దతు ఇవ్వడం లేదన్నారు. అయితే సీపీ యోగేశ్వర్ కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారని ప్రచారం సాగుతోంది. ఇందుకు అధిష్ఠానం కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. కానీ చిత్రదుర్గలో సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ.. సీపీ యోగేశ్వర్ పార్టీలో చేరే విషయం ప్రస్తావనకు రాలేదన్నారు. డీసీఎం డీకే శివకుమార్ బెంగళూరులో మాట్లాడుతూ సీపీ యోగేశ్వర్‌తో ఇటీవల ఎటువంటి చర్చలు జరగలేదని పార్టీలో చేర్చుకునే విషయమై ఖరారు కాలేదన్నారు. సీపీ యోగేశ్వర్ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు సభాపతి బసవరాజహొరట్టి ప్రకటించారు.

అన్నభాగ్యలో నగదుకు బదులు ఆహార కిట్లు

- పౌర ఆహార సరఫరాల శాఖ మంత్రి మునియప్ప

బెంగళూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బీపీఎల్, అంత్యోదయ కార్డు లబ్ధిదారులకు ఏడాదిన్నర కాలంగా అందిస్తున్న నగదు బదిలీలో మార్పులకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈమేరకు సోమవారం పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి మునియప్ప బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ ఇకపై నగదుకు బదులుగా ఆహార కిట్‌లను అందిస్తామన్నారు. దీనిపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వంటనూనె, గింజలు, బేడలతో కూడిన కిట్‌ను ఇవ్వదలిచామన్నారు. అన్నభాగ్య లబ్ధిదారులకు నగదు బదిలీ ద్వారా సకాలంలో సాధ్యం కానందున ఆహారపు కిట్‌లు అందించాలని భావిస్తున్నామన్నారు. నగదు బదిలీ నిరంతరం కొనసాగించడం సమంజసం కాదని పౌర ఆహార సరఫరాలశాఖ అధికారులు సూచిస్తున్నారన్నారు. అయితే ఎప్పటినుంచి ఆహారకిట్‌లు ఇవ్వాలనేది ప్రకటిస్తామన్నారు. రేషన్ కార్డులందరికీ న్యాయం జరిగేలా చూడాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. నాణ్యమైన సరుకులను అందరికీ అందేలా చూస్తున్నామన్నారు. రానున్న కాలంలో ప్రజా పంపిణీని మరింత మెరుగు పరుస్తామన్నారు.

న్యూస్ బాక్స్

స్టాండర్డ్స్ పాటించాలి

● ప్రొఫెసర్ దేవకుమార్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ దేవకుమార్

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్‌లో స్టాండర్డ్స్ పాటించాలని ఐఈఐ రాష్ట్ర గౌరవ కార్యదర్శి, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ దేవకుమార్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూ అనుబంధ కళాశాల ఎస్ఆర్ఐటీలో సోమవారం ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ డేను ఘనంగా నిర్వహించారు. సివిల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ రఘుబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌నకు ప్రొఫెసర్ దేవకుమార్, బీఐఈ డిప్యూటీ డైరెక్టర్ అఖిల్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్నొవేషన్‌లో యువ ఇంజనీర్లు మంచి స్టాండర్డ్స్ పాటిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐఈఐ సెక్రెటరీ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, సివిల్ హెచ్ఓడీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు కౌన్సెలింగ్



విద్యార్థులను ప్రశంసిస్తున్న ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐటీఐలో ప్రవేశాలకు నాలుగో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. విద్యార్థులు 26వరకు https://iti.ap.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ పూర్తి అయిన విద్యార్థులకు 28న ప్రభుత్వ, 30న ప్రైవేట్ కళాశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. కాగా నెహ్రూ యువకేంద్రం నిర్వహించిన చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలందజేసి సత్కరించారు.

కుండపోత



వేదవతి హగరిలో భారీగా ప్రవహిస్తున్న వరదనీరు

బొమ్మనహాళ్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు వేదవతి హగరి పొంగిపొర్లాయి. పత్తి, మొక్కజొన్న, జొన్న, మిరప తదితర పంటలు నీట మునిగాయి. భారీగా వరదనీరు రావడంతో వేదవతి హగరి ఉప్పొంగి ప్రవహించింది. మండలంలోని ఉద్దేహాళ్, గోనేహాళ్, శ్రీధరఘట్ట, సింగా నహళ్లి తదితర గ్రామాలలో కుండపోత వర్షం కురిసింది. సిద్ధరాంపురం, కురవళ్లి గ్రామాలలో మిరప, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి.

కోచింగ్‌కు గడువు పొడిగింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు నిర్వహించనున్న డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు గడువు పొడిగించినట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది వరకూ ఈ నెల 21 వరకు ఉన్న గడువును 25 తేదీ వరకూ పొడిగించినట్లు ఆమె తెలిపారు.

సమావేశం వాయిదా

అనంతపురం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల సంక్షేమ సంఘం సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిగుప్ప వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదివరకు ఈనెల 23న అనంతపురం నగరం కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాల్ లో సమావేశాన్ని నిర్వహించడంతోపాటు సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. త్వరలో తదుపరి తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

రేపు ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ అనంతపురం డివిజన్ పరిధిలోని అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, అనంతపురం అర్బన్ సీడీపీఓ లలిత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్, శింగనమల, నార్పల, తాడిపత్రి, ఉరవకొండ ప్రాజెక్టులోని కూడేరు మండలాలల్లో అంగన్వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఎంపిక పారదర్శకంగా సాగుతుందని, మధ్యవర్తులను నమ్మవద్దన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఇప్పుడైనా..!

- ఓడీ రద్దు కోసం ఎంపీఈఓల విశ్వప్రయత్నాలు
- చిత్తూరు జిల్లాలో పని చేస్తున్న 106 మంది
- జిల్లాకు రప్పించాలని ప్రజాప్రతినిధులకు వినతి
- ఖరీఫ్ ఈ-పంట నమోదు తర్వాత పంపుతామన్న ఉన్నతాధికారులు
- హామీ అమలు కోసం నిరీక్షిస్తున్న చిరుద్యోగులు

అనంతపురం అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సొంత జిల్లాకు రావడానికి ఎంపీఈఓలు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీ పాలనలో తమను ఓడీపై చిత్తూరుకు పంపి అన్యాయం చేశారని, మీరే న్యాయం చేయాలని ఇదివరకే వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును కలిసి విన్నవించారు. అలాగే వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. జిల్లా ప్రతినిధులతో సైతం సంబంధిత మంత్రి, అధికారులకు లేఖలు రాయించారు. గత జూలైలో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎంపీఈఓలను జిల్లాకు రప్పించాలని అనంత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సైతం కోరారు. దీంతో వ్యవసాయ కమిషనరేట్‌కు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం నుంచి లేఖ పంపారు. ఈ ఏడాది ఖరీఫ్ ఈ- పంట నమోదు పూర్తయిన తర్వాత ఓడీలు రద్దు చేసి అనంత జిల్లాకు పంపుతామని రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు ఎంపీఈఓలకు హామీ ఇచ్చారు. ఈ పంట నమోదుతోపాటు ఈకేవైసీ పూర్తయినా ఇప్పటి దాకా ఇచ్చిన హామీ అమలు కాలేదు. దీంతో ఎంపీఈఓలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

అరకొర జీతానికి అంతదూరమా..?

టీడీపీ పాలనలో 2015లో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఉమ్మడి అనంత జిల్లాలో 650 మంది ఎంపీఈఓ (మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్)లను కాంట్రాక్టు పద్ధతిపై ఎంపిక చేశారు. అప్పట్లో 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓను నియమించారు. వీరంతా వ్యవసాయ శాఖ తరఫున క్షేత్ర స్థాయిలో పనిచేస్తూ వచ్చారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. రైతు భరోసా కేంద్రాల్లో కొత్తగా వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశు సంవర్ధక శాఖ తరఫున గ్రామ స్థాయి సిబ్బందిని నియమించింది. ఆర్బీకే సిబ్బంది నియామకాలతో ఎంపీఈఓలకు కష్టకాలం మొదలైంది. గతంలో ఉమ్మడి జిల్లాలో 650 మంది ఎంపీఈఓలు పనిచేసేవారు. వీరిలో 175 మంది వీఏఏలు పోస్టులకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలో 4వేల ఎకరాల నుంచి 6వేల ఎకరాలకు ఒక ఆర్బీకేను ఏర్పాటు చేశారు. తద్వారా ఎంపీఈఓలకు అన్యాయం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాలో జరగని విధంగా అనంత జిల్లా ఎంపీఈఓలను చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపారు. 2021, 2022 సంవత్సరాల్లో రెండు విడతలుగా 253 మంది ఎంపీఈఓలను ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపారు. ప్రస్తుతం వీరిలో 106 మంది ఉమ్మడి చిత్తూరులో ఓడీపై పనిచేస్తున్నారు. మిగిలిన వారు అనారోగ్యం, ప్రసూతి సెలవులు, ఆర్థిక, కుటుంబ సమస్యలతో అక్కడ పనిచేయలేక తిరిగి వచ్చారు. వీరిలో 70 శాతం మంది మహిళా సిబ్బంది ఉండటం గమనార్హం. పేద కుటుంబాలకు చెందిన ఆ సిబ్బంది రూ.12వేల జీతం కోసం వారి కుటుంబ సభ్యులు, పిల్లలకు దూరంగా ఉంటూ పని చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో జనాభా ప్రతిపదికగా ఆర్బీకేలు ఏర్పాటు చేశారు. 60 ఎకరాల నుంచి 500 ఎకరాల పరిధిలో కూడా ఆర్బీకేలు ఏర్పాటు చేశారు. దీంతో వాటి సంఖ్య పెరిగింది. అనంత జిల్లాలో ఎక్కువ విస్తీర్ణానికి ఆర్బీకేలు ఏర్పాటు చేయడం ద్వారా ఇక్కడ పనిచేస్తున్న ఎంపీఈఓలకు అన్యాయం జరిగింది.



రైతు సేవా కేంద్రం



మంత్రి అచ్చెన్నాయుడుకు వినతి పత్రం ఇస్తున్న ఎంపీఈఓలు

ముమ్మరంగా వినతులు

వైసీపీ హయాంలో ఓడీపై చిత్తూరు జిల్లాకు ఎంపీఈఓలను పంపాలని నిర్ణయించిన నాటి నుంచి ఎంపీఈఓల సంఘం నాయకులు ఓడీ రద్దు చేసి, జిల్లాలోనే కొనసాగించాలని అప్పటి ప్రజాప్రతినిధులను అనేక సార్లు విన్నవించారు. ఉమ్మడి జిల్లాలో 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓ పోస్టును కేటాయిస్తే సమస్య పరిష్కారమవుతుందని విన్నవిస్తూ వచ్చారు. అయితే ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో తమకు న్యాయం జరుగుతుందన్న ఆశతో బాధిత ఎంపీఈఓలు పలు మార్లు కూటమి ప్రజాప్రతినిధులకు విన్నవించారు. ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరకపోవడంతో ఇకమీదట ఏమి చేయాలో తోచని అయోమయంలో పడ్డారు.

కుటుంబానికి దూరంగా..



నాది చెన్నేకొత్తపల్లి మండలం. వైసీపీ హయాంలో ఓడీపై చిత్తూరు జిల్లాకు పంపారు. నా భర్త రైతు. నాకు ఇద్దరు పిల్లలు. పెద్దమ్మాయికి ఆరేళ్లు, కుమారుడికి నాలుగేళ్లు. కుటుంబ అవసరాల రీత్యా తక్కువ వేతనమైనా తప్పని పరిస్థితుల్లో ఓడీపై చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్నా. పిల్లలను తలచుకుంటే కన్నీళ్లు వస్తాయి. నా భర్తే వారి ఆలనాపాలన చూస్తున్నారు. సెలవు రోజుల్లో ఊరికి వెళ్లి పిల్లలను చూసుకుంటున్నా. నాతోపాటు ఎక్కువ మంది మహిళలే ఓడీపై చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్నారు. అందరూ నాలాగే ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా మాకు న్యాయం జరుగుతుందన్న ఆశతో ఎదురుచూస్తున్నాం.

- నాగేశ్వరి, వ్యవసాయ శాఖ ఎంపీఈఓ



తిరుపతిలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కమిషనర్ ఢిల్లీరావులకు వినతి పత్రం అందజేస్తున్న బాధిత ఎంపీఈఓలు

తక్షణమే ఓడీలు రద్దు చేయాలి



ఈ ఏడాది ఖరీఫ్ ఈ పంట నమోదు పూర్తికాగానే ఓడీలు రద్దు చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ శాఖ కమిషనర్‌లు హామీ ఇచ్చారు. ఈ పంట నమోదు ఇప్పటికే పూర్తి చేశాం. ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఓడీలు రద్దు చేసి, సొంత జిల్లాకు పంపాలి. కూటమి ప్రభుత్వం మాకు న్యాయం చేస్తుందన్న నమ్మకం ఉంది. మంత్రితోపాటు ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ఉన్నతాధికారులు మేము వెళ్లిన ప్రతి సారి సానుకూలంగానే స్పందిస్తున్నారు. త్వరలో న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉంది.

- రెడ్డి ప్రసాద్, ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు

సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలి

- రాయలసీమకు రూ.10వేల కోట్లు కేటాయించాలి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్
- కలెక్టరేట్ వద్ద ముగిసిన సీపీఎం బస్సు యాత్ర



ప్రసంగిస్తున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్

అనంతపురం కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ పేర్కొన్నారు. జిల్లాకు సాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 19వ వరకు జిల్లా వ్యాప్తంగా బస్సుయాత్ర చేపట్టారు. యాత్ర ముగింపు సందర్భంగా సోమవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అధ్యక్షతన మహాధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎంఏ గఫూర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ అధ్వానంగా మారిందని విమర్శించారు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునికీకరణ పనులను పూర్తి చేయకుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. హంద్రీనీవా వెడల్పు చేస్తామని చెప్పిన హామీని విస్మరించారని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమ జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులకు రూ.10వేల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ జిల్లాకు చెందిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ చొరవ చూపి సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని కోరారు. మానవహక్కుల వేదిక నాయకుడు ఎస్ఎం బాషా మాట్లాడుతూ 14 సంవత్సరాలు గడుస్తున్నా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునికీకరణను ప్రభుత్వాలు పూర్తిచేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం స్పందించి 2008లో చేపట్టిన హెచ్చెల్సీ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాంభూపాల్ మాట్లాడుతూ సాగునీటికోసం చేస్తున్న పోరాటం ఇంతటితో ఆగదని, ప్రభుత్వంలో చలనం తీసుకొచ్చేవరకూ సాగుతుందని స్పష్టం చేశారు. ధర్నా అనంతరం నగర ఎమ్మెల్యే, ఎంపీలను కలిసి సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నల్లప్ప, సావిత్రి, నాగేంద్రకుమార్, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, నాగమణి, రామాంజనేయులు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోండి: కలెక్టర్

అనంతపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బీమా పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరు వినోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకంలో చేరడానికి 18ఏళ్ల నుంచి 50ఏళ్ల లోపు ఉన్న మహిళలు అర్హులన్నారు. ఈ బీమాలో చేరినవారు సహజంగా మరణించినా ఆకుటుంబానికి రూ. 2లక్షలు పరిహారం ఇస్తారన్నారు. ఒకవేళ ప్రమాదంలో మరణించినా అంతేమొత్తం పరిహారంగా ఇస్తారన్నారు. 51సంత్సరాల నుంచి 70ఏళ్లలోపు వారికోసం ప్రధాన మంత్రి సురక్షాబీమా యోజన ద్వారా ప్రమాదంలో మరణిస్తే రూ.2లక్షలు పరిహారం ఇస్తారని తెలిపారు. ఈ రెండు పథకాలలో సభ్యత్వం పొందడానికి ఏడాదికి రూ.456లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అధికారులు ఈ బీమా పథకాలపై అవగాహన కల్పించి అర్హులైన మహిళలను చేర్పించాలని కోరారు.

అప్పటి డిమాండ్లు.. ఇప్పుడు నెరవేర్చండి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

గుంతకల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ వివిధ డిమాండ్లతో ఆందోళనలు చేసిందని, ఇప్పుడు అధికారంలో ఉన్నందు న వాటన్నింటిని నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఉదయం ఆయన విలేకఖరుల సమావేశాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో బీజేపీ ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ప్రజాహిత పరిపాలనను తాము స్వాగతిస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందించిన ప్రజలు పాత పథకాలు, పాత ప్రాజెక్టులను ప్రభుత్వం చేపడుతుందన్న నమ్మకంతో ఉన్నారన్నారు. టీడీపీ హయాంలో హెచ్చెల్సీ ఆధునికీకరణ, హంద్రీనీవా వైడెనింగ్, రాగులపాడు లిఫ్టు, డ్రిప్ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగిందన్నారు. వాటన్నింటినీ పూర్తిచేసి, ఆశించిన మేరకు సాగునీరు అందించాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందని గుర్తు చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో నాలెడ్జి హబ్‌ను సాకారం చేయాలన్నారు. చార్జీలను పెంచడానికి విద్యుత్ శాఖ సమాయత్తమౌతోందని, కరెంటు చార్జీలను పెంచరాదన్నారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందజేయాలన్నారు. సమావేశంలో గోవిందు, వీరభద్రస్వామి, మహమ్మద్ గౌస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధర హాసమేదీ..?

- భారీగా పడిపోయిన ద్రాక్ష ధర
- కొనుగోలు చేయని వ్యాపారులు
- పొలంలోనే కుళ్లిపోతున్న పంట
- రూ.లక్షల్లో నష్టపోతున్న రైతులు



నేల రాలిన ద్రాక్ష



బండమీదపల్లిలో పొలంలోనే కుళ్లిపోయిన ద్రాక్ష

రాప్తాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ధర లేకపోవడం, వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు ద్రాక్ష రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొనేవారు లేక పంట కుళ్లిపోతుండటంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. మండలంలోని రాప్తాడు, ప్రసన్నాయపల్లి, రామినేపల్లి, హంపాపురం, మరూరు, చెర్లోపల్లి, బండమీదపల్లి, గొందిరెడ్డిపల్లి, గాండ్లపర్తి, కొత్తపల్లి, బొమ్మేపర్తి తదితర గ్రామాల్లో రైతులు ఎక్కువగా ద్రాక్ష పంట సాగు చేస్తారు. పందిరి ఏర్పాటు చేసి సీడ్ లెస్, సీడ్, నల్ల, తెల్ల ద్రాక్ష సాగు చేశారు. సీడ్‌లెస్ ద్రాక్ష 250 ఎకరాలు, సీడ్ ద్రాక్ష 100 ఎకరాలు వరకూ సాగు చేశారు. గతేడాది ద్రాక్ష ధరలు ఆశాజనకంగా ఉండటంతో సాగు చేసిన రైతులకు శ్రమకు తగిన ఫలితం లభించేది. ఈ ఏడాది కూడా ఆయా గ్రామాల్లో రైతులు ద్రాక్ష సాగు చేశారు. సకాలంలో మందులు పిచికారీ చేసి పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. పంట చేతికందే సమయంతో ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీడ్‌లెస్ ద్రాక్ష గతేడాది టన్ను రూ. 50 వేల నుంచి రూ.70 వేల వరకూ అమ్ముడుపోయింది. ఈ ఏడాది రూ. 20 వేలకు కూడా వ్యాపారులు అడగటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీడ్ ద్రాక్ష కూడా గతేడాది టన్ను రూ. 50 వేల వరకూ పలికింది. ఈ ఏడాది సీడ్ ద్రాక్షను వ్యాపారులు అడగడమే లేదని రైతులు వాపోతున్నారు. ద్రాక్షను వ్యాపారులు కొనుగోలు చేయకపోవడం, వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు పొలంలోనే పంట కుళ్లిపోతోంది. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టామని, కొనేవారు లేక తీవ్రంగా నష్టపోతున్నామని ద్రాక్ష రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధరలు తగ్గాయి

ఆగస్టు వరకూ ద్రాక్ష ధర బాగానే ఉండేది. రెండు నెలల నుంచి ధరలు తగ్గాయి. సీడ్ ద్రాక్ష పులుపు ఉండటంతో ఇక్కడి ప్రజలు తినడానికి ఇష్టపడరు. ఈ ద్రాక్షను వ్యాపారులు కొనుగోలు చేసి అస్సాం, బెంగాల్, బంగ్లాదేశ్ ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం వారు కూడా సీడ్ ద్రాక్షను కొనేందుకు ఆసక్తి చూపడం లేదు.

-రత్నకుమార్, ఉద్యానశాఖ అధికారి

రూ.8 లక్షలు ఖర్చు పెట్టా..



ఆరేళ్ల కిందట ద్రాక్ష సాగు చేయడం ప్రారంభించా. పందిరి ఏర్పాటు చేసి దిల్‌కుష్ రకం సీడ్ ద్రాక్ష సాగు చేశా. ప్రతి ఏడాది ధరలు బాగా ఉండటంతో శ్రమకు తగిన ఫలితం లభించేది. ఈ ఏడాది రెండున్నర ఎకరాల్లో ద్రాక్ష సాగుకు రూ. 8 లక్షలు ఖర్చు పెట్టా. దాదాపు 30 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ. 20 వేలకు కూడా వ్యాపారులు కొనడం లేదు.

- ప్రసాద్, బండమీదపల్లి

పొలంలోనే కుళ్లిపోతోంది



ఒకటిన్నర ఎకరాలో దిల్‌కుష్ రకం సీడ్ ద్రాక్ష సాగుకు రూ. 5లక్షలు ఖర్చు చేశా. ఏడాది కాలం పంటకు తెగుళ్లు, వైరస్‌లు రాకుండా జాగ్రత్తగా కాపాడుకున్నాం. ఆగస్టు వరకూ టన్ను ద్రాక్ష రూ. 50 వేలు ఉండేది. రెండు నెలల నుంచి ద్రాక్ష ధరలు చాలా తగ్గాయి. టన్ను ద్రాక్ష రూ. 20 వేలకు కూడా వ్యాపారులు కొనుగోలు చే యడం లేదు. వర్షాలకు ద్రాక్ష కుళ్లిపోయి పొలంలోనే రాలిపోతోంది. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందించాలి.

- వెంకటనాయుడు, బండమీదపల్లి

126 అంకెలు కాదు... బాలుడి పేరు

● అన్ని రికార్డుల్లోనూ అదే పేరు



126 పేరు ఉన్న బాలుడు

తాడిపత్రి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఒక్కొక్కరికి ఒక్కో రకమైన అభిరుచి ఉంటుంది. అది వారు ఆదర్శం కోసం చేసినా ఇతరులకు మాత్రం వైవిధ్యంగా కనిపిస్తుంది. ఇలాంటి కోవకు చెందినదే ఓ పిల్లాడికి పెట్టిన పేరు. సాధారణంగా తమ పిల్లలకు దేవుడికి సంబంధించినది కానీ తమ పూర్వీకులకు సంబంధించిన పేరు కానీ పెట్టుకుంటారు. ఇంకా కొందరు వెరైటీ కోసం ఇంటర్‌నెట్‌లో చూసి వినూత్నంగా ఉండేలా పెడతారు. కానీ తాడిపత్రికి చెందిన ఓ టీచర్ తన కుమారుడికి అంకెలతో పేరు పెట్టడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. తాడిపత్రిలోని సుంకులమ్మపాలెంకు చెందిన రాఘవేంద్ర, ప్రశాంతి దంపతులు తమ కుమారుడికి 126 అంటూ అంకెలతో పేరు పెట్టారు. రాఘవేంద్ర పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆధార్‌కార్డు, డేట్‌ఆఫ్‌బర్త్ సర్టిఫికెట్, పాఠశాల రికార్డుల్లో కూడా 126గా నమో దు చేయించాడు. ఎందుకిలా అని ప్రశ్నిస్తే 126 అంకెల్లో 1 అంటే ఐ, 2 అంటే యామ్, 6కి ఇండియన్ అని అర్థం వచ్చేలా పెట్టానన్నా రు. కుల, మత బేధాలు ఉండకుండా అందరూ భారతీయులుగా జీవించాలనే ఉద్దేశ్యంతోనే తాను ఈ పేరు పెట్టినట్లు తెలిపారు. తన కుమారుడికి ప్రస్తుతం ఆరేళ్ల వయసు ఉన్నా, పుట్టిన కొన్నిరోజులకే 126పేరు పెట్టానని, ప్రస్తుతం ప్రాచుర్యంలోకి వచ్చిందని తెలిపాడు. కుమారుడు పుట్టకమునుపే ఈ పేరు పెట్టాలని ఆలోచించి పెట్టుకున్నానని ఆయన తెలిపారు.



తల్లిదండ్రులతో.. 126

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ఐవాన్ బునిన్ (జయంతి)




రష్యా దేశ రచయిత ఐవాన్ బునిన్ 1870 అక్టోబరు 22న జన్మించారు. 'ది లైఫ్ ఆఫ్ అర్సెనివ్' నవలకు నోబెల్ సాహిత్య పురస్కారం అందుకున్న తొలి రష్యా రచయితగా గుర్తింపు పొందారు. ఆయన రాసిన పోయెమ్స్, కథలు విభిన్నంగా ఉంటూ ఆకట్టుకునేలా ఉంటాయి. 1953 నవంబరు 8న కన్నుమూశారు. 2020లో రష్యా ప్రభుత్వం 125వ జయంతి సందర్భంగా స్మారక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేసింది.

స్వామి రామతీర్థ (జయంతి)



స్వామి రామతీర్థ 1873 అక్టోబరు 22న ప్రస్తుత పాక్ పాలిత పంజాబ్ ప్రాంతంలో జన్మించారు. రామ్ సోమీగా పిలవబడ్డారు. ఉపాధ్యాయుడిగా, హిందూ తత్వవేత్తగా పేరొందారు. స్వామి వివేకానంద తర్వాత అమెరికాలో ఉపన్యాసాలు ఇచ్చిన తొలితరం హిందూమతం ప్రముఖ ఉపాధ్యా యులలో స్వామి రామతీర్థ ఒకరు. అమెరికాలోని భారతీయ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయడంలో సాయం చేశాడు. హిందూధర్మాన్ని బోధించడానికి జపాన్ పర్యటనకు టెహ్రీకి చెందిన మహారాజా కీర్తి షా బహదూర్ స్పాన్సర్ చేశారు. 'ఆచరణాత్మక వేదాంత' తత్వశాస్త్రంపై ఉపన్యాసాలు చేశారు. 1906లో ప్రజాజీవితం నుంచి వైదొలగి హిమాలయాల దిగువ ప్రాంతాలకు వెళ్లారు. ఆచరణాత్మక వేదాంతాన్ని క్రమబద్ధంగా ప్రదర్శించే పుస్తకాన్ని రాయడానికి సిద్ధమయ్యాడు. కానీ పూర్తికాకనే 32వ యేట 1906 అక్టోబరు 17న కన్నుమూశారు.

కొమరం భీం (జయంతి)



ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీక, అస్తిత్వ ఉద్యమాల వేగుచుక్కగా పేరొందిన కొమరం భీం 1901 అక్టోబరు 22న ఆదిలాబాద్ అడవులలో గోండు ఆదివాసుల కుటుంబంలో జన్మించారు. హైదరాబాద్ విముక్తికోసం, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొరిల్లా శైలిలో పోరాడారు. అడవిని జీవనోపాధిగా చేసుకుని అన్ని రకాల నిజాం అధికారాలను తోసిపుచ్చాడు. పశువుల కాపరులపై విధించిన సుంకానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టి 1940 అక్టోబరు 27న వీరమరణం పొందారు.

డోరిస్ లెస్సింగ్ (జయంతి)



ప్రముఖ నవలా రచయిత్రి డోరిస్ లెస్సింగ్ 1919 అక్టోబరు 22న ఇరాన్‌లో జన్మించారు. బ్రిటిష్-జింబాబ్వేయిన్ నావెలిస్ట్‌గా గుర్తింపు పొందారు. 2007లో నోబెల్ సాహిత్య పురస్కారాన్ని పొందారు. బ్రిటిష్ సాహిత్యంలో డేవిడ్ కోహెన్ ప్రైజ్ అందుకున్నారు. 50కుపైగా నవలలు ప్రచురించింది. టైమ్స్ పత్రిక 2008లో ప్రకటించిన '50 ప్రముఖ బ్రిటిష్ రచయితలు 1945 నుంచి' జాబితాలో 5వ ర్యాంకులో నిలిచారు. 'ది గోల్డెన్ నోట్‌బుక్' రచనతో అంతర్జాతీయ గుర్తింపు పొందారు. 2013 నవంబరు 17న కన్నుమూశారు.

దీపక్ చోప్రా (పుట్టినరోజు)



ఇండియన్-అమెరికన్ రచయిత దీపక్ చోప్రా 1946 అక్టోబరు 22న న్యూ ఢిల్లీలో జన్మించారు. ఆల్టర్‌నేటివ్ మెడిసిన్‌తో గుర్తింపు పొందారు. మహర్షి మహేశ్‌యోగి స్ఫూర్తితో ఆధ్యాత్మికంగానూ రాణించారు. 1996లో 'చోప్రా సెంటర్ ఫర్ వెల్ బీయింగ్' సంస్థను ఏర్పాటు చేసి ఆరోగ్యంపై ప్రజలలో చైతన్యం తెచ్చారు. మెటా ఫిజిక్స్, వేదాంతాలపై ప్రసంగాలు చేయడమే కాక రచనలు చేస్తున్నారు. 2021 నాటికి 91 పుస్తకాలు రాయగా వీటిలో 21 బెస్ట్ సెల్లర్‌గా నిలిచాయి. ఇవి 43 భాషలలోకి అనువాదం అయ్యాయి. 'ది సెవెన్ స్పిరిచ్యువల్ లాస్ ఆఫ్ సక్సెస్' పుస్తకం న్యూయార్క్ టైమ్స్ బెస్ట్ సెల్లర్ లిస్ట్‌లో 72 వారాలపాటు నిలిచింది.

అమిత్ షా (పుట్టినరోజు)



దేశ రాజకీయాల్లో అపర చాణుక్యుడిగా పేరొందిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా 1964 అక్టోబరు 22న ముంబైలో జన్మించారు. పూర్తి పేరు అమిత్ అనిల్ చంద్ర షా. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా, ఎన్డీయే చైర్మన్‌గా వ్యవహరించారు. ప్రధాని నరేంద్రమోదీ కేబినెట్‌లో కీలకంగా ఉన్నారు. ఎమ్మెల్యే స్థాయి నుంచి కేంద్రమంత్రి వరకు వివిధ హోదాలలో తనదైన ప్రత్యేకత చాటుకున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



కోరమంగలలో ఇలా...

బెంగళూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరవ్యాప్తంగా మరోరోజు వర్షం కురిసింది. ఆదివారం రాత్రి పొద్దుపోయాక ప్రారంభమైన వర్షం సోమవారం ఉదయం 9 గంటలదాకా నగరవ్యాప్తంగా కురిసింది. పలుచోట్ల రోడ్లు చెరువులను తలపించాయి. చామరాజపేట పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. జయనగర్, ఎలక్ట్రానిక్‌సిటీ, సర్జాపుర, కోరమంగల, యలహంక ప్రాంతాల్లోనూ ఇళ్లలోకి నీరు చేరింది. చామరాజపేటలో ఇళ్లలోకి నీరు చేరిన ప్రాంతాల్లో మంత్రి జమీర్ అహ్మద్ పరిశీలించారు. ప్రతిపక్షనేత అశోక్ పలు ప్రాంతాల్లో పర్యటించారు. కాగా లాల్‌బాగ్ చెరువు మరవ పారడంతో వాకర్స్ ఉత్సాహంగా తిలకించారు. మరవనీరు లాల్‌బాగ్‌లో ప్రవహించడంతో పాములు పదులసంఖ్యలో కనిపించాయి. కాగా నగరంలో వర్ష పరిస్థితిపై బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ ప్రత్యేకంగా సమావేశమై పరిష్కార చర్యలకు ఆదేశించారు. అత్యవసర సిబ్బంది కార్యాచరణలో పాల్గొన్నారు.



సిల్క్‌బోర్డ్ జంక్షన్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రతిపక్షనేత అశోక్, ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి

వర్షం బాధితులకు మంత్రి చేయూత

విజయనగర, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చామరాజపేట శాసన సభ నియోజకవర్గ పరిధిలోని జగ్జీవన్‌రామ్‌నగర్, ఐపీడీ సాలప్ప లే అవుట్ తదితర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొన్ని చోట్ల ఇళ్లకు పాక్షికనష్టం వాటిల్లింది. గృహ వసతి శాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ సోమవారం స్థానిక ప్రాంతాలను స్వయంగా పర్యటించారు. వర్షంతో దెబ్బతిన్న ఇళ్లకు రూ.15వేలు చొప్పున ఆర్థికసాయం అందచేశారు. ఈ సందర్భంగా స్థానికులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇళ్లు పూర్తిగా కోల్పోయినవారికి రాజీవ్‌గాంధీ హౌసింగ్ బోర్డు ద్వారా 20/30 స్థలాన్ని కేటాయించి పునరావాసం కల్పించాలని మంత్రికి విన్నవించారు.



ఆర్థికసాయం అందచేస్తున్న మంత్రి జమీర్



లాల్‌బాగ్ చెరువు మరవ నీటిలో చేపలు పడుతున్న చిన్నారులు

వీధి కుక్కల నియంత్రణ ఏదీ..?



బాగేపల్లి పట్టణంలో వీధికుక్కల సంచారం ఇలా..

బాగేపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన బాగేపల్లిలో వీధికుక్కలు అధికమయ్యాయి. ఇవి ఒక్కసారిగా గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో పాదచారులు, వాహనచోదకులు వెళ్లేందుకు జంకుతున్నారు. 23వ వార్డులో వీధికుక్కలు దండులా సంచరిస్తున్నాయి. తరచూ మొరుగుతూ వెంట పడుతున్న కారణంగా ప్రజలు సంచరించాలంటే భయపడుతున్నారు. పట్టణంలోని సంత మైదానం, బస్టాండ్, గంగమ్మగుడి రోడ్డు, కొత్తపల్లి రోడ్డు, గూళూరు రోడ్డులలో మాంసం దుకాణాలు, మాంసాహార హోటళ్ల వద్ద వీధికుక్కల సంచారం అధికంగా ఉంటోంది. సాయంత్రం వేళల్లో కుక్కల ప్రవర్తన క్రూరంగా ఉంటోందని పాదచారులు వాపోతు న్నారు. సైకిల్, బైక్‌పై సంచరించేవారిని వెంబడిస్తూ దాడి చేసేందుకు యత్నిస్తుండడంతో వాటినుంచి తప్పించుకునే ప్రయత్నంలో పలువురు కింద పడి గాయపడ్డారు. కాగా చెత్తదిబ్బల వద్ద ఆహార వ్యర్థాలను తినేందుకు వీధికుక్కలు భారీగా సంచరిస్తుండడంతో చెత్త వేసేందుకు కూడా భయపడాల్సిన పరిస్థితి నెలకొందని కొత్తపల్లిరోడ్డుకు చెందిన గృహిణి మంగళ వాపోయారు. రాత్రివేళల్లో వీధికుక్కల అరుపులతో నిద్ర కరువైందన్నారు. పగటివేళ దుకాణానికి వెళ్లి సరుకులు తెచ్చుకోవడానికి కూడా సమస్యగా మారిందన్నారు. వీధికుక్కలనుంచి బయటపడేందుకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సంచరించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. స్థానికులు పలువురు ఇదే అభిప్రా యాన్ని వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వీధికుక్కలను నియంత్రించాలని కోరుతున్నారు.

సంతానహరణ శస్త్రచికిత్సలకు చర్యలు

పురసభ ముఖ్య అధికారి శ్రీనివాస్ మాట్లా డుతూ వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటా మన్నారు. తాలూకా పశుసంవర్ధకశాఖ అధికారులతో చర్చించామన్నారు. సంతానహరణ శస్త్రచికిత్సలు నిర్వహించేలా ఆదేశించామని త్వరలోనే ప్రక్రియ కొనసాగనుందన్నారు. వీధి కుక్కలను నియంత్రిస్తామన్నారు.

చింతామణి: పట్టణంలో వీధికుక్కల సమస్య రోజురోజుకు అధికమవుతోంది. పట్టణంలోని పలు వార్డులలో గుంపులు గుంపులుగా వీధికుక్కలు తిరుగుతుండడంతో పాదచారులు, వాహనాచోదకులు బెంబేలెత్తుతున్నారు. నగరసభ ఐదారేళ్లక్రితం కొన్ని వీధికుక్కలకు సంతానహరణ శస్త్ర చికిత్సలు చేయడం మినహా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పట్టణంలోని గాంధీనగర్ లే అవుట్‌లో వీధికుక్క ఇటీవల కొన్ని పిల్లలను ఈనింది. వీధికుక్కల సంచారంతో ప్రజలు రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్నారు. వాహన చోదకులు, స్కూల్ పిల్లలపై వీధికుక్కలు దాడులు చేస్తున్న ఘటనలు సాధారణమయ్యాయి. ఎక్కువగా పిల్లలు ఏదైనా తినే వస్తువులు తీసుకెళ్లే సందర్భంలోనే వీధికుక్కలు దాడి చేశాయి. దాదాపు అన్ని లే అవుట్‌లలో ఇదే పరిస్థితి నెలకొన్నా ప్రజా ప్రతినిధులు, నగరసభ అధికారులు మౌనంగా ఉండడం ప్రజలలో ఆశ్చర్యం కలిగిస్తోంది. సాధారణంగా ఐదేళ్లకోసారి రాష్ట్రంలో వీధికుక్కల గణన చేపట్టేవారు అయితే ఈసారి పట్టణంలో ప్రక్రియ చేపట్టలేదని తెలుస్తోంది.

ఉద్యోగుల సంఘానికి 30మంది ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన కొందరు అభ్యర్థులు

బంగారపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి వివిశాఖల నుంచి మొత్తం 64 నామినేషన్లు సమర్పించారు. నామినేషన్ల ఉపసంహరణకు సోమవారం గడువు కావడంతో 34మంది వాపసు తీసుకున్నారు. దీంతో 30మంది అభ్యర్థులు పోలింగ్ లేకుండా ఏకగ్రీవమైనట్టు సహాయక ఎన్నికల అధికారి జనార్దన్‌నాయుడు తెలిపారు. పట్టణంలోని బీఆర్‌సీ కార్యాలయంలో మీడియాకు ఆయన వివరాలు తెలిపారు. వ్యవసాయశాఖనుంచి ప్రతిభా ఎస్, పశుసంవర్ధకశాఖ నుంచి వీ నారాయణస్వామి, ప్రజా పనులశాఖ నుంచి పవన్‌మంగళ వేడ, పంచాయతీరాజ్‌శాఖ నుంచి కేవీ గణేశ్, ప్రాథమిక విద్యాశాఖ నుంచి అప్పయ్యగౌడ, సుజాత, వెంకటేశప్ప, రమేశ్, హైస్కూల్ విద్యాశాఖ నుంచి వెంకటేశ్, శంకరప్ప, బీఈఓ కార్యాలయం నుంచి దేవరాజ్, పీయూ విద్యాశాఖ నుంచి బోడిరెడ్డి, డిగ్రీ కాలేజ్ నుంచి వేణుగోపాల్, అటవీశాఖ నుంచి శ్రీలక్ష్మి, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ నుంచి ఎం కృష్ణ, సవిత, ఆర్ రవి, పజాని, ఉద్యానవనాల శాఖ నుంచి ఏటీ మునిరాజు, స్త్రీశిశుసంక్షేమశాఖ నుంచి సీడీపీఓ మునిరాజప్ప, భూ రికార్డులశాఖ నుంచి ఎం కృష్ణ, సవిత, ఆర్ రవి, పజాని తదితరులు 30 డైరెక్టర్ల స్థానాలకు ఏకగ్రీవమైనట్టు తెలిపారు. ఏకగ్రీవమైన అప్పయ్యగౌడ మాట్లాడుతూ 30న తాలూకా అధ్యక్షస్థానం, కోశాధికారి, రాష్ట్ర పరిషత్‌కు ఎన్నికలు జరుగుతాయని అందరూ ఏకగ్రీవమయ్యేలా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని అభినందించారు.

తాగునీటి పథకాలకు రూ.62 కోట్లు

● ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో తాగునీటి ప్రాజెక్టులను గాలికి వదిలేసిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. పీఏబీఆర్ డ్యాం వద్ద తాగునీటి పథకాల ఫిల్టర్, పంపింగ్ స్టేషన్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సత్యసాయి తాగునీటి పథకానికి మూడు మోటార్లు ఉండగా.. ఒకటి మాత్రమే పని చేస్తోందని, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు. ఇంద్రావతి వద్ద హంద్రీనీవా కాలువ నుంచి నింబగల్లు చెరువుకు నీటి పంపింగ్ పనుల గురించి అధికారులతో చర్చించారు. నూతన తాగునీటి పథకాల గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి పల్లెకు తాగునీటిని అందించేందుకు రూ.62 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని అన్నారు. ఉదిరిపికొండ నుంచి ఉరవకొండ వరకూ పైప్‌లైన్ పనులను త్వరలోనే మొదలు పెడతామని అన్నారు. హంద్రీనీవా కాలువ వరకూ ఏప్రిల్ వరకూ నీరు వచ్చే అవకాశం ఉందని, ఇంద్రావతి నుంచి నింబగల్లు వరకూ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులు నింపేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. నింబగల్లు చెరువు నుంచి ఉరవకొండ వరకూ ప్రత్యామ్నాయంగా మరో పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. నింబగల్లు, కొనకొండ్ల చెరువుల వద్ద ఫిల్టర్‌బెడ్లు దయనీయంగా ఉన్నాయని, అక్కడ మైక్రోఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. గతంలో ఉరవకొండలో 10 రోజులకు ఒకసారి నీరు వచ్చేదని, ప్రస్తుతం ఐదు రోజులకు ఒకసారి వదులుతున్నామని అన్నారు.

మానసిక ఆరోగ్యమూ ముఖ్యమే



సివిల్ న్యాయాధికారి జె పూజా తదితరులు

శిడ్లఘట్ట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శారీరక ఆరోగ్యం తోపాటు మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమే అని సమస్య ఏదైనా ఉంటే పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహా సూచనల మేరకు పాటించాలని ప్రధాన సివిల్ న్యాయాధికారి జె పూజా అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో తాలూకా న్యాయసేవల సమితి, న్యాయవాదుల సంఘం సంయుక్తంగా ఏర్పాటు చేసిన విశ్వ మానసిక ఆరోగ్య దినోత్సవం, వృద్ధుల దినోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. మనిషి శరీరానికి ఎలా జ్వరం, దగ్గు వంటి సమస్యలు వస్తాయో మానసిక ఆరోగ్యం పట్ల కూడా దృష్టి సారించాలన్నారు. వృద్ధులను గౌరవించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని, తల్లిదండ్రులను అప్యాయంగా చూసుకోవాలన్నారు. వృద్ధులు అన్యాయానికి గురైతే చట్ట పరంగా అవగాహన కల్పించి న్యాయం చేకూర్చాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి పాలనా వైద్యాధికారి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ మానసిక సమస్యలకు కూడా చికిత్సలు లభిస్తాయని, గోప్యంగా ఉంచుకోకుండా డాక్టర్లకు వివరిస్తే పరిష్కారం సాధ్యమన్నారు. సమావేశంలో తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశ్‌మూర్తి, తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఏ నారాయణస్వామి, కార్యదర్శి సీజీ భాస్కర్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో సేద తీరుతున్న చిన్నారులు

బంగారపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బలమందె గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ మునిరాజు సోమ వారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల సంక్షేమం కోసం స్త్రీ శిశుసంక్షేమశాఖ పలు పథకాలు అమలు చేస్తోందని ప్రత్యేకించి పౌష్టికాహారం అందచేస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు తగిన సౌకర్యాలు ఉండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడేలా సామాజిక పరివర్తనలో భాగంగా పలు పథకాలు ఉన్నాయన్నారు. సరిహద్దు ప్రాంతం కావడంతో పలు విమర్శలు వస్తుంటాయని నివారణకు తగిన చర్యలు చేపట్టామన్నారు. చిన్నారుల హాజరు, పౌష్టికాహార పంపిణీ, కార్యకర్తల కార్యవైఖరిని పరిశీలించినట్టు తెలిపారు.

అర్చకుల సమస్యలపై స్పందించాలి



బెంగళూరుకు బయల్దేరుతున్న సభ్యులు

శిడ్లఘట్ట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దైవారాధననే నమ్ముకుని జీవనం సాగిస్తున్న అర్చకులు, ఆగమికుల సమస్య లపై ప్రభుత్వం సాను కూలం గా స్పందించాలని తాలూకా అర్చక, ఆగమికుల సమాఖ్య అధ్యక్షుడు కేవీ సత్య నారాయణాచార్ అభిప్రాయ పడ్డారు. సోమవారం పట్టణం నుంచి బెంగళూరులోని రాష్ట్ర స్థాయి సమావేశానికి బయల్దేరే వేళ ఆయన మాట్లాడుతూ అర్చకవృత్తి పవిత్రమైనదన్నారు. ధార్మిక కార్యక్రమాల్లో దేవుడు, భక్తుడి మధ్య అర్చకుడు సేతువులా వ్యవహరిస్తున్నారన్నారు. అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. సమాఖ్య సహకార్యదర్శి ఎస్ సత్యనారాయణరావ్ మాట్లాడుతూ తస్తిక్ మొత్తాన్ని పెంచాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సమాఖ్య సభ్యులు కృష్ణమూర్తి, వెంకటేశమూర్తి, రామదాస్, కృష్ణన్, కుందలగుర్కి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జలప్రదాత చంద్రబాబు

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

బుక్కపట్నం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కరువు ప్రాంతమైన రాయలసీమ జిల్లాలోని చెరువులకు నీరిచ్చిన జలప్రదాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మారాల రిజర్వాయర్‌కు హంద్రీనీవా కాలువ నుంచి కృష్ణా జలాలను సోమవారం విడుదల చేశారు. మారాల గ్రామ సమీపాన కాలువ గట్టును ఎక్స్‌కవేటర్ సాయంతో తవ్వి, నీటిని మళ్లించారు. అనంతరం ఎమ్మెల్యే గంగపూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత టీడీపీ హయాంలో రిజర్వాయర్‌కు నీరు విడుదల చేసి, చంద్రబాబు జలహారతి ఇచ్చారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రిజర్వాయర్‌కు చుక్క కూడా నీరివ్వలేదన్నారు. నియోజకవర్గ రైతులను ఆ పార్టీ అధినేత జగన్, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మోసం చేశారన్నారు. నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ నింపుతామని 2019 ఎన్నికల సందర్భంగా ప్రగల్భాలు పలికిన శ్రీధర్ రెడ్డి అధికారం చేపట్టాక ఆ ఊసే మరిచారన్నారు. చెరువులకు చుక్కకూడా నీరిచ్చిన దాఖలాల్లేవన్నారు. కూటమి అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే నియోజకవర్గానికి నీరిచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. ఐదేళ్లలో నియోజకవర్గంలోని 193 చెరువులను నింపే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, నాయకులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




మారాల రిజర్వాయర్‌కు వెళ్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ

కదిరి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కదిరి ఆర్టీసీ డిపో డ్రైవర్ రమేష్‌నాయుడు తన నిజాయితీని చాటుకున్నాడు. శనివారం కదిరి నుంచి విజయవాడకు వెళ్లే బస్సులో నరసారావుపేటకు చెందిన జేషయ్య కదిరిలో బస్సు ఎక్కాడు. రూ. 10 వేలు ఉన్న అతని పర్సు బస్సులో పడిపోయింది. నరసారావుపేటలో దిగి.. ఇంటికెళ్లిన తరువాత జేషయ్య తన పర్సు పోయినట్లు గుర్తించి.. ఆర్టీసీ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించాడు. ఆ అధికారులు ఫోన్ ద్వారా డ్రైవర్ రమేష్ నాయుడికి సమాచారం అందించారు. అతను బస్సులో సీటు కింద పడి ఉన్న ఆ పర్సును తీసుకొని.. జేషయ్యకు సమాచారం ఇచ్చాడు. తిరుగు ప్రయాణంలో నరసారావుపేటలో జేషయ్యకు ఆ పర్సును ఆదివారం అందజేశాడు. దీంతో అతను డ్రైవర్ రమేష్‌నాయుడికి కృతజ్ఞతలు తెలిపాడు.



జేషయ్యకు పర్సు అందచేస్తున్న డ్రైవర్ రమేష్‌నాయుడు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.91	1,611.77
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	29,516	66
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	29,336	9,887
సామర్థ్యం (టీఎంసీలు)	101.42	41.18

విద్యావంతులను చేయాలి: ఖాద్రి

సిరుగుప్ప, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దిననాడే దేశం అభివృద్ధి చెందుతుందని వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు సయ్యద్ మోహిద్దీన్ ఖాద్రి పిలుపునిచ్చారు. సోమవారం సిరుగుప్ప పట్టణం ముజాహిద్ మంజిల్ భవనంలో గ్యార్వీ వేడుకలను నిర్వహించారు. అల్లాను స్మరించారు. మోహిద్దీన్ ఖాద్రి ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలను విద్యావంతులను చేయాలని సూచించారు. అనంతరం ప్రసాద పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ముస్లిం ప్రముఖులు, గురువులు, ముస్లింలు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

● మిరప రైతులకు శాస్త్రవేత్తల సూచన



మిరపకు సోకిన ఆకుముడత తెగులు

బళ్లారి సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల కారణంగా తెగుళ్లు సోకుతాయని, మిరప రైతు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుత ఏడాది 42,625 హెక్టార్లలో మిర్చి సాగుచేశారు. గతేడాది మిర్చి పంటకు వచ్చిన కొత్త త్రిప్స్ నుసి తెగుళ్ళు ఈసారి కూడా వచ్చే అవకాశం ఉందని ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ సంతోష్ సప్పంది తెలిపారు.

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

కీటకాలు ఆకుల దిగువ భాగంలో, పువ్వుల లోపల, వెలుపల సమూహాలలో కనిపిస్తాయి. ప్యూపల్ దశలు ఆకుల దిగువ భాగంలో కేంద్రీకృతమై ఉంటాయి. కీటకాలు మొక్క యొక్క అనేక భాగాల నుండి రసాన్ని పీలుస్తాయి. మొక్కల పెరుగుదలను తగ్గిస్తుంది. ఆకుల అంచులు పైకి ముడుచుకోవడం, పువ్వులు రాలిపోవడం, పెరుగుతున్న రెమ్మలు పుష్పించకుండా వాడిపోవడం వంటి సాధారణ లక్షణాలు, కాలక్రమేణా కాయల సంఖ్య దిగుబడి గణనీయంగా తగ్గుతుంది.

నివారణ చర్యలు

పొలం చుట్టూ 2-3 వరుసల మొక్కజొన్న, సజ్జలను కవర్ పంటగా వేస్తే తెగుళ్ల వ్యాప్తిని అరికట్టవచ్చు. త్రిప్స్ లార్వాలకు తోడ్పడే కలుపు మొక్కలను పొలాన్ని, పొలాలను శుభ్రం చేయడం ద్వారా తొలగించవచ్చు, తగిన అంతరం నిర్వహించాలి. బాగా కుళ్ళిన ఆవు పేడను పొలాల్లో మెటార్‌హైజియంఅనిసోప్లియా శిలీంధ్ర సంహారిణితో కలపాలి, వేప, వానపాముల ఎరువు మట్టిలో కలపడం వల్ల నిరోధకత పెరుగుతుంది. ప్రభావితమైన మొక్కలను కొమ్మలతో కప్పాలి లేదా కాల్చివేయాలి. రసాయినిక క్రిమిసంహారకాలు లీటరు నీటికి అవసరాన్ని బట్టి కలిపి పిచికారీ చేయాలన్నారు.

హంపిలో చిరుత

కంప్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రం హంపిలో సోమవారం సాయంత్రం అక్కచెల్లెలు కొండపైభాగంలో చిరుత ప్రత్యక్షమైంది. దీంతో పర్యాటకులు భయాందోళనకు గురయ్యారు. నెల రోజులుగా ఈ ప్రాంతంలోని నవదిబ్బ, పుష్కరిణి, గజశాల, విజయవిఠల దేవస్థానం పలు ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో చిరుత కనిపిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. మరోసారి కమలాపురం నుంచి హంపి మార్గంలో కనిపించడంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. సమీప కొండల్లో నుంచి తరచూ వన్యప్రాణులు ప్రవేశిస్తున్నాయంటున్నారు. అధికారులు బోను ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని పర్యాటకులు కోరుతున్నారు.

నష్టాల బాటలో వేరుశనగ రైతు

● వరుస వర్షాలతో నల్లగా మారిన కాయలు ● భారీగా పడిపోయిన ధరలు ● రైతులకు తప్పని ఆవేదన

బళ్లారి సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కష్టపడి సాగుచేసిన పంట చేతికి వచ్చిన సమయంలో ఓ వైపు ధరల తగ్గుదల, మరో వైపు వర్షాలు వేరుశనగ రైతులకు కన్నీరు తెప్పిస్తున్నాయి. రెండేళ్లుగా ఖరీప్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులతో పంటలు చేతికందక పోవడంతో రైతులు తీవ్రనష్టాలు చవిచూశారు. ఈఏడాది ఖరీప్ సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు బాగా కురుస్తుండటంతో ఈఏడాదైనా పంట చేతికొచ్చి అప్పులు తీర్చుకుంటామన్న అన్నదాతకు మళ్లీ చుక్కెదురయ్యింది. 20రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు కోత దశకు వచ్చిన వేరుశనగను బాగా దెబ్బ తీస్తున్నాయి.

మార్కెట్‌కు తరలి వస్తున్న సరుకు

తడిసిన వేరశనగ కాయలు నల్లగా మారి నూనె శాతం పడిపోయే అవకాశాలు ఉండటంతో మార్కెట్‌లో ధరలు భారీగా పడిపోయాయి. బళ్లారి జిల్లాతోపాటు పొరుగున ఉన్న అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పండించిన వేరుశనగను రైతులు బళ్లారి, చెళ్లకెరె మార్కెట్‌లకు తరలిస్తున్నారు. బళ్లారిలో వారంలో రెండు సార్లు వేరశనగ విక్రయాలు జరుగుతున్నాయి. వేరుశనగా ధర నిలకడగా లేకపోవడంతో రైతులను ఆందోనకు గురిచేస్తుంది.



బళ్లారి మార్కెట్‌లో వేరుశనగ బస్తాలను దించుతున్న కూలీలు

అమాంతం తగ్గిన ధరలు

10రోజులు క్రితం క్వింటాల్ రూ.7,500కుపైగా ఉన్న వేరుశనగా ధర ప్రస్తుతం 5,500నుంచి 6,500 వరకు పడిపోయింది. దీంతో పెట్టుబడులు కూడా చేతికి అందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి దాదాపు రూ. 30వేలు పైగా పెట్టుబడి పెట్టిన రైతులకు ఈ ఏడాది కూడా కష్టాల నుంచి గట్టెక్కె పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కన్నడ రథానికి ఘనస్వాగతం



కన్నడ రథానికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే గణేష్, కరవే సభ్యులు

కంప్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కన్నడ రథానికి ఘనంగా స్వాగతం పలికారు. కంప్లికి వచ్చిన కన్నడ జ్యోతి రథానికి అధికారులు, కన్నడ సాహితీపరిషత్ సభ్యులు కంప్లిలోని ఏపీఎంసీ ఆవరణంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పాల్గొని ఈ ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, పూర్తిగా ఆకట్టుకున్నారు. ఏపీఎంసీ ఆవరణం నుంచి ఎదురు మసీదు నుంచి రాజ్‌కుమార్ రోడ్డు ప్రధాన వీధుల్లో రథాన్ని ఊరేగించారు. తహసీల్దార్ శివరాజ్‌కుమార్, కన్నడ సాహితీపరిషత్ అధ్యక్షులు హేమయ్యస్వామి, ఈఓ శ్రీకుమార్, ముఖ్య అధికారి దుర్గన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, బంగి దొడ్డ మంజునాథ, అంబన్న, వెంకటరెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.
సిరుగుప్ప : కన్నడ రథయాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం కన్నడ రథం సిరుగుప్ప తాలుకాలోకి ప్రవేశించింది. మేళతాళాలు, డోలు ఢమరులతో కళాకారులు రథయాత్రను ఆహ్వానించారు. తహసీల్దార్ విశ్వనాథ్ పూజలు జరిపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఈ రథయాత్రను చేపట్టినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. డిసెంబరు 23న దావణగెర కన్నడ సాహిత్య సమ్మేళనం నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ రథయాత్ర చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు తాలుకా ప్రజలు, కళాకారులు పాల్గొన్నారు.



నీట మునిగిన జొన్న పంట

నీట మునిగిన పంటలు..

● వర్షంతో దెబ్బతిన్న పంటలు, ఇళ్లు

తోరణగల్లు, అక్టోబరు 21 : సండూరు తాలుకాలో, సండూరులో 15 ఎంఎం చోర్‌నూరుల్లాలో 30.2 మిల్లీమీటర్లు కురేకుప్ప గ్రామంలో 2.3 మిల్లీమీటర్లు, విఠలాపురంలో 39.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. విఠలాపురంలో అతిపెద్ద వర్షం వలన ఆ ప్రాంతం లోని పొలాల్లోకి నీరు చేరడం జరిగింది.



పొలంలో నిండిన వర్షపునీరు

అమరవీరులను స్మరించుకోవడం అందరి కర్తవ్యం: ఐజీపీ



గౌరవందనం స్వీకరిస్తున్న ఐజీపీ లోకేశ్‌కుమార్, కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, జడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప తదితరులు

బళ్లారి సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు, కర్తవ్య నిర్వహణకు ప్రాణాలర్పించిన పోలీసు అధికారులు, సిబ్బందిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని బళ్లారి జోన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బీఎస్ లోకేశ్‌కుమార్ పేర్కొన్నారు. బళ్లారి జిల్లా పోలీసుల తరఫున నగరంలోని జిల్లాపోలీసు కవాత్ మైదానంలో సోమవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దేశ రక్షణ ప్రజా ప్రయోజనాల కోసం అద్భుతమైన సేవలందిస్తూ సుస్థిర సమాజ నిర్మాణంలో పోలీసు అమరవీరుల సహకారం ఎంతో ఉందన్నారు. పోలీసు అమరవీరులకు నివాళి అర్పిస్తూ రానున్న రోజుల్లో అమరవీరుల సంఖ్య గణనీయంగా తగ్గాలని, పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా ప్రశాంత జీవనం సాగించాలన్నారు.
కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి అహర్నిశలు శ్రమించి అంకితభావంతో పనిచేసిన పోలీసు అమరవీరుల సేవ మరువలేనిదన్నారు. పోలీసుల విశ్వసనీయతతోనే సమాజంలో శాంతి నెలకొందని, వారి త్యాగాల వల్లే సమాజంలో శాంతి నెలకొందన్నారు.
ఎస్పీ శోభారాణి మాట్లాడుతూ వీరమణం పొందిన అధికారులు,న సిబ్బంది అందరి స్మారకార్థం, శాంతి కోసం దేశవ్యాప్తంగా 21న పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2023-24సంవత్సరంలో దేశవ్యాప్తంగా పోలీసు శాఖలో మొత్తం 219మంది అధికారులు,సిబ్బంది కర్ణాటక రాష్ట్రానికి చెందిన 08మంది సిబ్బంది అమరులయ్యారని ఈ రోజున వారి త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. ఈసందర్భంగా అమరవీరుల స్మారక స్థూపానికి ప్రముఖులంతా పుష్పగుచ్చాలు సమర్పించి నివాళులర్పించారు. ఈసందర్భంగడా జిల్లాపంచాయితీ సీఈఓ రాహుల్ శరణప్ప, లోకాయుక్త సిద్ధరాజు, అదనపు పోలీసు సూపరెంటెండెంట్ రవికుమార్,ఇతర పోలీసులు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
గంగావతి రూరల్ : పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా కొప్పళ నగరంలో జిల్లాధికారి నలిన్ అతుల్ ఆధ్వర్యంలో కార్యకరమం నిర్వహించారు. జోరుగా వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా అమర వీరులకు వర్షంలోనే నివాళి అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లాధికారి నలిన్ అతుల్, జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ రత్నం పాండే హాజరయ్యారు. ఇదే సందర్భంలో అమరవీరులకు పోలీసు గౌరవ వందనంతో పాటు, మౌనాచరణ, పోలీసు ధ్వజాన్ని సగానికి దింపి అమరవీరులను స్మరించారు.
రాయచూరు: శాంతి భద్రతల పరిరక్షణ ప్రజల ప్రాణాల రక్షణకు పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. అంతర్గత శత్రువులతో పోలీసులు పోరాడి ఫలితంగా ఎందరో సమర్థులైన అధికారులు సిబ్బంది ప్రాణాలు విడిచారని జిల్లాధికారి నితీశ్ అన్నారు. సోమవారం నగరంలోని డీఏఆర్ పోలీస్ మైదానంలో (జిల్లా ఎస్పీ పరేడ్ మైదానం) పోలీస్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ దళాలతో గౌరవవందనం స్వీకరించి ఆయన మాట్లాడారు.



ప్రభుత్వాస్పత్రిలో ఓపీ కోసం వేచివున్న రోగులు

ప్రబలుతున్న వైరల్ జ్వరాలు

● రోగులతో ఆసుపత్రులు కిటకిట

కంప్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వైరల్ జ్వరాలతో జనం అల్లాడుతున్నారు. కంప్లి సముదాయ ప్రభుత్వాస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. తాలుకా పరిధిలోని ఏ గ్రామంలో చూసినా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు సోకాయి. ఇప్పటికే ఆరోగ్య శాఖ అధికారులు గ్రామాల్లో జ్వరాల భారిన పడకుండా పీహెచ్‌సీ సెంటర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. రోగులకు అత్యవసర వైద్యం కల్పిస్తున్నారు. అయినప్పటికీ గ్రామాల్లో జ్వరాలు తగ్గడం లేదు. ఈ సందర్భంగా డాక్టర్ తరుణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జ్వరాలు సోకిన వెంటనే ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని, నిర్లక్ష్యం చేయరాదన్నారు. సరైన పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని సూచించారు. రోగులకు అనుగుణంగా కంప్లి సముదాయ ఆస్పత్రిలో అన్ని మందులు సిద్ధంగా వున్నాయన్నారు. సాయంత్రం వరకు వైద్యులు అందుబాటులో వుంటారని తెలిపారు.

వాల్మీకి సంఘం పదాధికారుల నియామకం



పదాధికారులను సన్మానిస్తున్న దృశ్యం

కంప్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలో వాల్మీకి దేవస మితి సమాజం పదాధికారుల నియామకం సోమవారం జరిగింది. గౌరవాధ్యక్షులుగా సుంకప్ప, నాగభూషణ, శివరామప్ప, అధ్యక్షులుగా బి పంపాపతి, ఉపాధ్యక్షులుగా ఉప్పరళ్లి జంబయ్య, ప్రధాన కార్యదర్శి రాజప్ప, మెట్రి అంబరేష్, కనికేరి శ్రీనివాస్, కోశాధికారి రామచంద్రప్పదుర్గయ్య, సంచాలకులుగా కృష్ణమూర్తి, వీర శంకర్, వీరేష్, గణేష్, మౌనేష్‌గా ఎన్నికైనట్లు పట్టణ పంచాయతీ ఉపాధ్యక్షులు కనికేరి పంపాపతి తెలిపారు. ఎన్నికైన పదాధికారులకు అభినందించి సన్మానించారు. ఎన్నికైన సభ్యులు తమవంతుగా సమాజ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంజిని, చెన్నప్ప, దివాకర్, శంకరప్ప, హనుమంతు, కనక, శంకర్, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఎన్నికల బహిష్కరణ



రోడ్డుపై బైఠాయించిన అంబేడ్కర్ కాలనీ వాసులు

తోరణగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో సమస్యలు పరిష్కరించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని సండూరు తాలుకా విఠలాపుర గ్రామం డాక్టర్ అంబేద్కర్ కాలనీవాసులు హెచ్చరించారు. సోమవారం వారు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్నా ఇండ్ల పట్టాలు లేవని, పన్నులు కడుతున్నా సరైన పత్రాలు రావడం లేవన్నారు. సర్వే నెంబర్ 162 ఏబీసీడీఈఎఫ్‌జీహెచ్ మొదలగు విఠలాపుర గ్రామ పరిధిలో పొలాలకు సహాయ అధికారులు హక్కు పత్రాలు ఇచ్చినా సాగుకు అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్థులు చౌడప్ప బాబు, రామన్న స్వామి, గంగప్ప, దొడ్డ మారెప్ప, మహిళలు, దుర్గమ్మ యల్లమ్మ, లక్ష్మమ్మ, హేమలత కాలనీవాసులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

● అంతర్జాతీయ స్థాయిలో విజయం



అవార్డు అందుకుంటున్న అనిత

రాయచూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బ్రైనో బ్రెయిన్ పేరుతో చెన్నై నగరంలో ఆదివారం రాత్రి నిర్వహించిన అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో నగరానికి చెందిన బాలిక చాంపియన్‌గా నిలిచింది. నగరానికి చెందిన డాక్టర్ బసవరాజ్‌హళ్ళి కూతురు అనితాహళ్ళి అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ విజేతగా నిలిచి జిల్లాకు కీర్తిని సాధించి పెట్టింది. ఈమెతో పాటు జిల్లా నుంచి వెళ్లిన బాలల్లో మరో 9 మందికి చాంపియన్‌షిప్ దక్కగా మరో ఆరుగురు గోల్డ్ మెడల్ సాధించారు. కాగా అంతర్జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచిన అనితా హళ్ళి తాత బసప్పహళ్ళి తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ బాలలకు సరైన శిక్షణ ప్రోత్సహం అందిస్తే అద్వితీయ ప్రతిభను చూపుతారని ఇందుకు పోటీల్లో విజేతలైన వారే ఉదహరణ అన్నారు. జిల్లా నుంచి అబాకస్ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటిన చిన్నారులను పలువురు విద్యావంతులు, అధికారులు ప్రశంసించారు.

రక్తదాన జాతా ప్రారంభం



జాతాను ప్రారంభిస్తున్న డీహెచ్ఓ డాక్టర్ సురేంద్ర బాబు

రాయచూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నగరంలో నిర్వహించిన రక్తదాన జాథాను డీహెచ్ఓ డాక్టర్ సురేంద్ర బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 65 సంవత్సరం వరకు మంచి ఆరోగ్యం కలిగి ఉన్న ప్రతియొక్క వ్యక్తి రక్తదానం చేసేందుకు ముందుకురావాలని కోరారు. జిల్లాయంత్రాంగం, జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, కర్ణాటక రాష్ట్ర ఏయిడ్స్ నిర్మూలన సంస్థ, రిమ్స్, నవోదయ ఆస్పత్రి, ఐఎంఏ సంఘం, లయన్స్ క్లబ్, రెడ్‌క్రాస్ సంస్థ, ఎన్‌కే ప్యారామెడికల్ తదితర సంఘాల సంయుక్తాధ్వర్యంలో డీహెచ్ఓ కార్యాలయం నుంచి ప్రారంభమైన జాథ టిప్పుసుల్తాన్ రోడ్డు, తీన్ ఖందిల్, క్లాథ్ బజార్, తదితర ప్రధాన రహదారుల గుండా సాగింది. రక్తదాన జాథాలో వివిధ పాఠశాల, కళాశాలల నర్సింగ్ విద్యార్థులు, అధికారులు, డాక్టర్‌లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

విజేతలకు బహుమతుల ప్రదానం

హోసూరు అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నవరాత్రి కొలువులు పోటీలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం హోసూరుల్లోని ఏఎస్‌టీసీ హడ్కో ప్రాంతంలోని సుధా ఎంటర్‌ప్రైజస్ కాంప్లెక్స్‌ల్లో జరిగింది. హోసూరులో తంబిరాస్ హోసూరు ఆధ్వర్యల్లో నవరాత్రి కొలువుల పోటీల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది, కార్యక్రమానికి జయరామన్ అధ్యక్షత వహించగా వకీశ్వరన్ స్వాగతం పలికారు. సురేశ్ హోస్ట్ చేశారు. కార్యక్రమ సమన్వయకర్తలు రోహిణి గణేశ్, సుధా నాగరాజ్ పాల్గొన్నారు. సురేశ్ అందరికి స్వాగతం పలికారు. ప్రోగాం కో-ఆర్డినేటర్ రోహిణి గణేశ్ సుధా నాగరాజ్ పాల్గొని పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు కన్సోలేషన్ బహుమతులు పంపిణీ చేశారు. స్వామినాథన్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

మడకశిర రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలంలోని హెచ్‌ఆర్ పాళ్యం గ్రామానికి చెందిన మనోజ్ (24) అనే యువకుడు సోమవారం ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సీఐ రామారావు తెలిపిన మేరకు.. హెచ్‌ఆర్ పాళ్యానికి చెందిన నాగరాజుకు ఉన్న ఒక్క కుమారుడు మనోజ్ ఐటీఐ చదువుకున్నాడు. ఎక్కడా ఉద్యోగం దొనక్క, దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యచేసుకోన్నాట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గ్రీవెన్స్ డేలో 326 వినతులు

హోసూరు(కృష్ణగిరి) అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీపుల్స్ గ్రీవెన్స్ డే సమావేశం కలెక్టర్ కె.ఎం.సరయు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఇళ్లు, ఉచిత కుట్టుమిషన్‌లు, వృద్ధాప్య పింఛన్, మహిళా హక్కుల భృతి, రోడ్డు సౌకర్యం, విద్యుత్ కనెక్షన్ వంటి సమస్యలపై 326 వినతి పత్రాలను స్వీకరించారు. అర్హులైన అర్జీలపై వెంటనే పత్రాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకు ముందు వెనుకబడిన వర్గాలు, క్రైస్తవ చర్చిల్లో పనిచేస్తున్న వారికి 51 బోధకులకు, కార్మికులను సంక్షేమ సభ్యత్వ కార్డులను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సాధనకురళ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (సామాజిక భద్రతా పథకం) పన్నీర్ సెల్వం, జిల్లా కలెక్టర్‌కు ఇంటర్వ్యావ్వ అసిస్టెంట్ సందురరాజ్, జిల్లా ఆది ద్రావిడర్ సంక్షేమ అధికారి రమేశ్ కుమార్, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ సరయూ

సామూహిక వివాహాల్లో ఒక్కటైన జంటలు

హోసూరు(కృష్ణగిరి) అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి, హిందూ ధార్మికశాఖ తరపున సామూహిక వివాహాల్లో 9జంటలు ఏకమయ్యాయి. వధూవరులకు 4 గ్రాముల బంగారు తాళితో పాటు రూ.50 వేలు ఆర్థిక సాయం, వంట సామగ్రిలు, బీరువాలు ఇతరత్రా అందించారు. బర్గూరు ఎమ్మెల్యే మదియళగన్, కలెక్టర్ సరయు నేతృత్వం వహించారు. కృష్ణగిరి జిల్లాలో కాటినాయనపల్లిలోని ఆంజనేయ, సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో 9 జంటలకు వివాహాలు జరిపారు. హిందూ ధార్మిక ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం.జ్యోతిలక్ష్మి జిల్లా ధర్మకర్తల కిమటీ చైర్మెన్ రజినిసెల్వం, జిల్లా కమిషనర్ పొన్నాల, ధర్మకర్తల కమిటీ సభ్యులు చిన్నస్వామి, చిన్నరాసు, విజయకుమార్, కలైవాణి, కార్యనిర్వహణాదికారులు శివకుమార్, చిత్ర గోవిందరాజ్, ఆలయ అనువంశిక ధర్మకర్త కృష్ణచంద్, వధూవరుల బంధువులు తదితరులు పాల్గొన్నారు.



దంపతులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మదియళగన్, కలెక్టర్ తదితరులు